సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



గేదెల్లోనూ సరోగసీ

వెంకట్రామన్నగూడెం గేదెల పరిశోధన స్థానం సరోగసీ ప్రక్రియను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి సన్నద్ధమైంది. గేదెల్లోనూ సరోగసీ విధానంపై ప్రత్యేక దృష్టి సారించింది. 10లో



వేరుశనగ.. దిగుబడి దండిగా

మెట్టలో వేరుశనగ అధికంగా పండిస్తున్నారు. సస్యరక్షణ చర్యలు చేపడితే వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. 10లో



ఫెన్సింగ్‌లో పతకాల పంట

కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. పలు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 10లో

న్యూస్‌రీల్

నీట్ సూపర్ స్పెషలైజేషన్‌లో 376 ర్యాంకు



డాక్టర్ సిరి చందన

పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లు మండలం గొల్లవానిచెరువు గ్రామానికి చెందిన డాక్టర్ సిరి చందన (ఎంబీబీఎస్, డీఎన్‌బీ జనరల్ మెడిసిన్) ఆల్ ఇండియా నీట్ సూపర్ స్పెషలైజేషన్ ఫలితాల్లో 376వ ర్యాంకు సాధించింది. సిరి చందన శ్రీకాకుళంలోని జేమ్స్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసి హైదరాబాద్‌లో యశోద ఆసుపత్రిలో డీఎన్‌బి జనరల్ మెడిసిన్ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. సిరిచందన మాట్లాడుతూ సూపర్ స్పెషలైజేషన్‌లో భాగంగా గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో కోర్సు పూర్తిచేయాలనే సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న డీపీఓ మల్లిఖార్జునరావు, డీఎస్పీ శ్రీనాథ్, డీఎల్‌డీవో అప్పారావు

భీమవరం(ప్రకాశం చౌక్): బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి జీవీకె మల్లికార్జునరావు కోరారు. జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సోమవారం జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత భారతదేశం, బాలల భద్రతే భారత్ భద్రత కార్యక్రమం నిర్వహించారు. తొలుత జిల్లా పంచాయతీ అధికారి బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ బాల్య వివాహాలు నివారించేందుకు గ్రామస్థాయి నుంచి కలిసికట్టుగా పని చేయాలన్నారు. బాల్య వివాహం వలన పిల్లలపై దుష్పరిణామాలు విశదీకరించాలన్నారు. డీఎస్పీ బి.శ్రీనాథ్ మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరం అన్నారు. బాల్య వివాహం చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. బాల్య వివాహంపై సమాచారాన్ని చైల్డ్ లైన్ 1098 నెంబరుకు తెలియజేయాలన్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.34 లక్షలు స్వాహా

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఇంద్రప్రస్థ ప్రాంతానికి చెందిన కొత్తకోట అన్నపూర్ణ ఉన్నత విద్య అభ్యసించి ప్రస్తుతం ఇంటివద్దనే ఉంటుంది. ఆమె మొబైల్ ఇన్‌స్టాగాంకు ఒక లింక్ వచ్చింది. మీరు పెట్టుబడి పెట్టిన ప్రతి పైసాకు 40 నుంచి 50 శాతం లాభాలు వస్తాయని ఇప్పటికే గ్రూపులో 100 మంది సభ్యులు ఉన్నారని ఆ మెసేజ్‌లో పేర్కొన్నారు. దానిని నమ్మిన ఆ యువతి ఈ నెల 8న రూ.1500 పెట్టుబడి పెట్టగా 40 శాతం లాభంతో డబ్బులు ఇచ్చారు. పూర్తిగా నమ్మిన ఆమె అనేకమార్లు రూ.34 లక్షల వరకూ సొమ్ములు చెల్లించింది. తాను చెల్లించిన సొమ్ము లాభాలతో ఇవ్వాలని కోరగా, మరికొంత కట్టాలని మెలిక పెట్టారు. రూ.15 లక్షలు కడితేనే సొమ్ము రిలీజ్ చేస్తామని చెప్పారు. తాను మోసపోయానని గ్రహించిన అన్నపూర్ణ ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటీపీలతో అప్రమత్తంగా ఉండండి

ఏలూరు(మెట్రో): ప్రభుత్వ పథకాల కోసం ఎవరైనా ఓటీపీల కోసం ఫోన్లు చేస్తే నమ్మవద్దని జిల్లా సచివాలయాల శాఖ నోడల్ అధికారి జి.రమణ తెలిపారు. అమ్మఒడి పథకానికి ఓటీపీ చెప్పాలని అపరిచితులు ద్వారా ఫోన్లు వస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులను అప్రమత్తం చేశారు. ఏ పథకానికైనా ఓటిపి అవసరమైతే సచివాలయంలో పనిచేసే సిబ్బంది లబ్ధిదారులు వద్దకు నేరుగా వస్తారని రమణ తెలిపారు. అవసరమైనప్పుడు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వస్తారని వివరించారు. అంతేగానీ సచివాలయాల ద్వారా ఫోన్‌లో ఓటిపి అడిగే పద్ధతి లేదన్నారు. ఏ ఒక్కరూ ఫోన్‌లో ఎవరికీ ఓటిపి చెప్పవద్దన్నారు. అపరిచితులు, సైబర్ నేరస్తులు ఇలా ఓటీపీలు అడుగుతూ ప్రజల బ్యాంక్ ఖాతాలో డబ్బులు కాజేసే ప్రమాదం ఉందన్నారు. సచివాలయం ఉద్యోగి, వలంటీర్ ఫోన్‌లో ఓటీపీ అడిగితే సంబంధిత ఎంపీడీఓకి, మున్సిపల్ కమిషనర్ గానీ, డివిజనల్ అభివృద్ధి అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు .

సచివాలయాలకు శాశ్వత భవనాలు

- జిల్లాలో రూ.79.86 కోట్లతో 366 భవనాల నిర్మాణం
- 70 శాతం నిర్మాణాలు పూర్తి



విస్సాకోడేరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

భీమవరం(ప్రకాశంచౌక్): పాత పంచాయతీ భవనాలకు మోక్షం కల్పిస్తూ ప్రభుత్వం సచివాలయాల పేరిట నూతన భవనాలను మంజూరు చేసింది. పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి రూ.79.86 కోట్లతో 366 నూతన పంచాయతీ భవనాలను ప్రభుత్వం మంజూరు చేయగా 70 శాతం భవనాలు పూర్తయ్యాయి. కొత్త భవనాల నుంచి పాలన సాగిస్తున్నారు. మిగిలిన భవనాలు వేగంగా నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలకు నూతన భవనాలను మంజూరు చేస్తున్నామని ప్రచారం చేసుకోవడం తప్ప ఎక్కడా కనీసం గది కూడా నిర్మించలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టిన వెంటనే గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాలు ఉండాలనే లక్ష్యంతో పంచాయతీ భవనాలు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో పూర్తయిన భవనాలను మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు కలిసి ప్రారంభించారు.

3 రకాల భవనాలు

గ్రామాల్లో నిర్వహించే గ్రామ సచివాలయ భవనాలకు ప్రభుత్వం 3 రకాల గ్రాంట్లను మంజూరు చేసింది. టైప్ 1 కింద రూ.40 లక్షలు (పూర్తి పంచాయతీ భవన నిర్మాణం), టైప్ 2 కింద రూ.25 లక్షలు (ప్రస్తుతం ఉన్న భవనంపై అదనపు ఫ్లోర్), టైప్ 3 రూ.35 లక్షలు (ఉన్న భవనానికి ఆనుకుని మరో భవనం). జిల్లాలో దాదాపు 90 శాతం నూతన భవనాలను నిర్మిస్తున్నారు. జిల్లాకు మంజూరైన 366 భవనాలకు ఇప్పటి వరకూ 256 భవనాలు పూర్తి చేశారు. దీనిలో సుమారు 200 భవనాలు ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చారు. నూతన భవనం నుంచి పాలన సాగిస్తున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీలను తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్న పంచాయతీల్లోని పాలన సాగించామని.. ప్రభుత్వాలు మారినా పంచాయతీ పరిస్థితి మారలేదని పాత భవనాలతోనే కాలక్షేపం చేసేవారని సీఎం జగన్‌మోహన్ రెడ్డి వచ్చి మోక్షం కల్పించారని ప్రజలు అంటున్నారు. గ్రామంలో హెల్త్ క్లినిక్ రైతు భరోసా భవనాలతోపాటు పంచాయతీ నూతన భవనాలు నిర్మించడం అభినందనీయమని తెలిపారు.



దిరుసుమర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం

శాశ్వత భవనం నిర్మించారు



మా పంచాయతీ ప్రైవేటు భవనంలో నడిచేది. గతంలో ఎన్ని ప్రభుత్వాలు ఉన్నా శాశ్వత భవనం నిర్మించలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే సహకారంతో నూతన సచివాలయ భవనం మంజూరైంది. వేగంగా నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చాం. ఇప్పుడు మా గ్రామానికి శాశ్వత పంచాయతీ భవనం ఉంది.

– కోళ్ల బాలకృష్ణ, దిరుసుమర్రు సర్పంచ్

ఏళ్ల తరబడి శిథిల భవనంలోనే..



మా గ్రామ పంచాయతీకి సొంత భవనం లేదు. శిథిలావస్థలో ఉన్న భవనంలో కొంత కాలం, రాజుల కమ్యూనిటీ హాల్లో పంచాయతీ నడుస్తుంది. ఈ ప్రభుత్వం మా గ్రామానికి శాశ్వత పంచాయతీ భవనాన్ని మంజూరు చేయడంతో నూతన భవనం నిర్మించారు. భవన నిర్మాణం పూర్తి కావడంతో త్వరలోనే నూతన భవనం ప్రారంభించనున్నారు.

– బి.రాంబాబు, కొండేపూడి మాజీ సర్పంచ్

కొత్త భవనం నుంచి పాలన



మా గ్రామానికి చిన్న పంచాయతీ భవనం ఉండేది. అది కూడా శిథిలావస్థలో ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే సహకారంతో 2 ఫ్లోర్లలో నూతన పంచాయతీ భవనం మంజూరు చేసి వేగంగా నిర్మించారు. ఇప్పుడు కొత్త భవనం నుంచి పాలన జరుగుతోంది. కొత్త పంచాయతీ భవనం రావడం సంతోషంగా ఉంది.

– సీహెచ్ ఏడుకొండలు, నవుదూరు

వేగంగా నిర్మాణాలు, ప్రారంభోత్సవాలు



జిల్లాలో నూతన సచివాలయ భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. రూ.79.86 కోట్లతో 366 భవనాల నిర్మాణం చేపట్టాం. ఇప్పటి వరకూ 70 శాతం భవనాలు పూర్తయ్యాయి. పూర్తయిన భవనాలను వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తున్నాం. సొంత భవనాలు లేని పంచాయతీలకు యుద్ధ ప్రాతిపదికన శాశ్వత భవనాల నిర్మాణం జరుగుతుంది.

– కెఎస్ఎస్ శ్రీనివాస్, జిల్లా పంచాయతీరాజ్ ఈఈ

స్పెషల్ పీపీపై దాడికి నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు

ఏలూరు (టూటౌన్): విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ స్పెషల్ పీపీ వివేకానందపై దౌర్జన్యం చేసి కొట్టడానికి ప్రయత్నించిన చంద్రబాబు తరపు న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ కోర్టు పక్కన ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద ఏపీపీలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచంట వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాజేంద్రప్రసాద్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీపీ రామాంజనేయులు మాట్లాడుతూ స్కిల్ స్కాంలో జ్యుడిషియల్ రిమాండ్‌లో చంద్రబాబుకు వేరే కేసులో పీటీ వారెంట్ జారీ చేస్తున్నట్లు కోర్టు ఆదేశాలు జారీ చేయడాన్ని జీర్ణించుకోలేని అతని తరపు న్యాయవాదులు న్యాయమూర్తిని దూషించడం బాధాకరమన్నారు. సీఐడీ స్పెషల్ పీపీ వివేకానందపై దాడికి యత్నించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు తరపు న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి యత్నించిన వారిపై బార్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్, ప్రభుత్వ న్యాయవాది బి.జగన్నాథరెడ్డి, ఏపిపిలు కందుల దత్తు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పితాని దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



అర్జీలు స్వీకరించి బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనకు వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి స్పందనలో ఆమె పాల్గొని అర్జీలు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సేవ చేయడం అదృష్టంగా భావించి అధికారులు పని చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం, ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందనకు వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్పందనలో ప్రజలు అందజేసిన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్పందన ద్వారా అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కరించడానికి అవకాశం లేకపోతే అందుకు కారణాలు అర్జీదారులకు వివరించాలన్నారు. అర్జీలు తిరిగి ఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. స్పందనకు 252 అర్జీలు వచ్చాయని వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కె. సంగీత్ మాథుర్, పంచాయతీ శాఖ అధికారి జీవీకె మల్లిఖార్జునరావు, డీఎల్‌డీవో కెసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల్లో కొన్ని

- తన భర్త చనిపోయాడని వైఎస్ఆర్ బీమా పథకం మంజూరైందని, ఇంతవరకు బ్యాంకులో బీమా లబ్ధి జమ కాలేదని తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధి కుంచనపల్లి నివాసి తలారి నరసమ్మ ఫిర్యాదు చేసింది.
- గ్రామంలో ప్రభుత్వానికి చెందిన స్థలంలో అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించారని దాని వల్ల వాహనాలు మెయిన్ రోడ్డుకు వెళ్లలేకపోతున్నాయని ఆచంట మండలం ఆచంట వేమవరం నివాసి కుక్కల లక్ష్మీ ఫిర్యాదు చేసింది.
- గ్రామంలో రక్షిత మంచినీరు ఫిల్టర్ కాకుండా వస్తున్నాయని దీనివల్ల వైరల్ జ్వరాలతో బాధపడుతున్నామని కాళ్ళ మండలం కోపల్లే గ్రామ నివాసి బి.సత్యనారాయణ ఫిర్యాదు చేశారు.

మెడికల్ షాపుల్లో డిజిటలైజేషన్

- డిజిటల్ రికార్డులు, సీసీ కెమెరాలు తప్పనిసరి
- ఉమ్మడి జిల్లాలో 4,500 షాపుల్లో మార్పులకు శ్రీకారం



తణుకు: వైద్యుల సిఫార్సులు(ప్రిస్క్రిప్షన్) లేకుండా మందుల విక్రయాలు.. నార్కొటిక్ మందుల అమ్మకాలు.. బిల్లులు లేకుండా మందుల లావాదేవీలు... వీటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయించే వారిపై కొరడా ఝుళిపించేందుకు ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం సన్నద్ధమైంది. ఇందుకు మందుల షాపులను డిజిటలైజేషన్ చేయడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని సుమారు 4,500 మందుల షాపుల్లో మార్పులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. పారదర్శకంగా మందుల విక్రయాలతోపాటు డిజిటల్ రికార్డులు నిర్వహించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

పగడ్బందీగా చట్టం అమలు

ఔషధ నియంత్రణ విభాగం పర్యవేక్షణలో నిర్వహిస్తున్న మందుల దుకాణాల్లో తప్పనిసరిగా ఫార్మాసిస్టు ఉండేలాని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా మందుల షాపుల్లో సర్టిఫికెట్ కలిగిన ఫార్మాసిస్టు ఉండరు. వారికి సంబంధించిన సర్టిఫికెట్ కాంట్రాక్టు పద్ధతిలో తీసుకుని షాపులో ఏర్పాటు చేస్తుంటారు. దాదాపు 90 శాతం షాపుల్లో సర్టిఫైడ్ ఫార్మాసిస్టు ఉండరు. దీన్ని నియంత్రించడానికి ప్రభుత్వం పలు నిబంధనలు అమల్లోకి తీసుకువచ్చింది. ప్రధానంగా నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) చట్టం ప్రకారం ఇకపై ప్రతి మందుల దుకాణాల్లో కచ్చితంగా డిజిటల్ రికార్డులు నిర్వహించాలి. ఇందుకోసం కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతోపాటు సీసీ కెమెరాలు తప్పనిసరి చేశారు. మందులు కొనుగోలు చేసిన తర్వాత ఆ దుకాణం నుంచి కచ్చితంగా వాటికి సంబంధించిన బిల్లులు కొనుగోలుదారుడికి ఇవ్వాలి. నార్కొటిక్ మందుల విక్రయాలను అడ్డుకునేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఎన్ఆర్ఎక్స్, మత్తును కలిగించే మందులను విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోనున్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ తీసుకువస్తే అందులో సిఫార్సు చేసిన సంఖ్య మేరకు మాత్రమే మందులు ఇవ్వాల్సి ఉంటుంది. చట్టవ్యతిరేకంగా మత్తు కలిగించే మందులను విక్రయిస్తే షాపు లైసెన్సు రద్దు చేయడంతోపాటు యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు చేపట్టారు.

అక్రమ మందులకు అడ్డుకట్ట

ఉమ్మడి జిల్లాలో గతంలో అక్రమ మందుల దందాను గుట్టురట్టు చేసిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మూలాలను గుర్తించే పనిలో ఉన్నారు. భీమవరం, తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు షేక్ అబిద్‌అలీ, మల్లిఖార్జునరావుతోపాటు విజిలెన్స్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జీవని నేతృత్వంలో ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సోదాల్లో పెద్ద మొత్తంలో అక్రమ మందులను గుర్తించారు. ముఖ్యంగా అబార్షన్ కిట్లు, అల్ప్రాజోలం, సిల్డెనాఫిల్, లెవోనోర్జెస్ట్రాల్ మందులను పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లిగూడెం, గణపవరం ప్రాంతాల్లో నిల్వ చేసిన మందులను అధికారులు గుర్తించారు. బిల్లులు లేకుండా పొరుగు జిల్లాలతోపాటు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వ్యాపారులు మందుల షాపులతోపాటు కిరాణా షాపుల్లో సైతం విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన అధికారులు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు.


ఇష్టానుసారంగా విక్రయిస్తే చర్యలు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మందుల షాపుల్లో డిజిటలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. దీనిప్రకారం మందులు కొనుగోలు చేసిన తర్వాత కచ్చితంగా వాటికి సంబంధించిన బిల్లులు తీసుకోవాలి. ఎవరైనా బిల్లులు ఇవ్వని పక్షంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇష్టానుసారంగా ఎన్ఆర్ఎక్స్, మత్తును కలిగించే మందులు విక్రయిస్తే షాపు లైసెన్సు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు చేపడతాం.

– హరిప్రసాద్, అడిషినల్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం



ద్వారకాతిరుమల గుడిసెంటర్‌లో నిర్మిస్తున్న 40 అడుగుల స్వామివారి భారీ విద్యుత్ కటౌట్



శ్రీవారి 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలకు సోమవారం ఏర్పాట్లు చురుగ్గా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పనులు శరవేగంగా జరిగాయి. ఈనెల 24 నుంచి 29 వరకు జరగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని గుడి సెంటర్‌లో 40 అడుగుల స్వామివారి భారీ విద్యుత్ కటౌట్‌ను నిర్మిస్తున్నారు. ఆలయ గోపురాలకు, పరిసరాలకు విద్యుద్దీప అలంకారాలు చేస్తున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శ్రీవారి 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి వేద ఆశీర్వచనాన్ని అందించగా, ఈఓ త్రినాథరావు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రాన్ని డిప్యూటీ సీఎంకు ఈవో అందజేశారు.

18 ఏళ్లలోపు వారు బడిలో ఉండాలి



దొడ్డనపూడి సచివాలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కాళ్ళ: 5 నుంచి 18 ఏళ్ళ వయసున్న వారు తప్పనిసరిగా బడిలో ఉండాలని ఏ ఒక్కరూ బయట ఉండకూడదని అధికారులను కలెక్టర్ పీ ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కాళ్ల మండలం దొడ్డనపూడి, బొండాడపేట గ్రామ సచివాలయాల్లో గ్రాస్ ఎన్రోల్మెట్ రేషియో(జీఈఆర్) యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏ కారణం చేత బయట ఉన్నా వారిని గుర్తించి వెంటనే బడిలో చేర్పించాలని అన్నారు. జీఈఆర్ నూరుశాతం లేనిచోట పిల్లలకు, పిల్లల తలిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. చదువుకోవడం వల్ల మెరుగైన ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ప్రతీ గడపకు వెళ్లి అవగాహన కల్పించాలని వలంటీర్లకు సూచించారు.అవసరమైతే ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేసి అవగాహన కల్పించి జీఈఆర్ నూరుశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు మరోసారి పాఠశాలలో చేరి చదువుకునే అవకాశం ఉందన్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక వంటి పథకాలు వీరికి కూడా వర్తిస్తాయని అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు విద్యార్థుల డేటాను ఒకేచోట లభ్యమయ్యేలా ప్రక్రియ వల్ల మనకు సహాయపడుతుందన్నారు. తహసీల్దార్ టీఏ కృష్ణారావు, ఎంపీడీవో డాక్టర్ జీ జ్యోతి, ఆర్ఐ లక్ష్మీకిరణ్, సచివాలయం పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాల తనిఖీ ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): ఈవీఎంల మొదటి దశ తనిఖీలు నేటి నుంచి జిల్లాలో ప్రారంభించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం ఈవీఎం గొడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలను జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అవసరమైన ఈవీఎంలను నేటి నుంచి సుమారు 40 రోజులపాటు రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తిస్థాయిలో పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ప్రతి యంత్రంలో ఓట్లు వేసి ఏదైనా సాంకేతిక లోపం ఉంటే వాటిని పక్కన పెట్టి, మిగిలిన వాటిని ఆమోదించే ప్రక్రియ అని వివరించారు. బెంగుళూరు నుంచి వచ్చిన బెల్ ఇంజినీర్ల నిర్వహణలో వెబ్ క్యాస్టింగ్, పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ జరిగే కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీలు ప్రతినిధులు హాజరై ఈవీఎంల సాంకేతికతపై అనుమానాలు నివృతిత్ చేసుకోవచ్చని చెప్పారు. కేంద్రంలో సెల్ఫోలు నిషేధమని.. గుర్తింపు కార్డులు ఉన్న సిబ్బంది మాత్రమే పనిచేస్తారని, సీసీ కెమెరాల్లో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి


అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: పోలీసు స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను చట్టప్రకారం సత్వరమే విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ రవిప్రకాష్, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 16 అర్జీలు రాగా, వాటిలో వరకట్న వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించినవి ఉన్నాయి.

18, 19 తేదీల్లో మరో రెండు ప్రత్యేక రైళ్లు


నరసాపురం: దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని నరసాపురం–వికారాబాద్ మధ్య మరో రెండు ప్రత్యేక రైళ్లను రైల్వేశాఖ ప్రవేశపెట్టినట్టు నరసాపురం రైల్వేస్టేషన్ మాస్టర్ దివాకర్‌బాబు చెప్పారు. ఈనెల 15, 16 తేదీల్లో రెండు రైళ్లను నడుపుతుండగా, మళ్లీ ఈ నెల 18, 19 తేదీల్లో ఈ రైళ్లు తిరిగి నడపనున్నట్లు తెలిపారు. 07453 సర్వీస్ నంబర్‌తో ఈనెల 18న నరసాపురంలో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి పాలకొల్లు, భీమవరం, గుంటూరు మీదుగా తరువాత రోజు ఉదయం 6.30 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. మళ్లీ 07454 సర్వీస్ నంబర్‌తో 19న సాయంత్రం 5.15 గంటలకు వికారాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.10 గంటలకు నరసాపురం చేరుకుంటుందని వివరించారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి


రంగారావు మృతదేహం

నూజివీడు: ఆయిల్ పామ్ తోటలో గెలలు కోసేందుకు వెళ్లిన ఓ కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పల్లెర్ల మూడికి చెందిన జంపిన రంగారావు (25) గొల్లపల్లిలోని రఘునాథస్వామి ఆలయ భూములను కౌలుకు చేస్తున్న గన్నవరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన తోటలో ఆయిల్‌పామ్ గెలలు కోసే పనులకు సోమవారం వెళ్లాడు. తోటలో పొడవాటి గెడ కత్తితో గెలలు కోస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గేదెల్లోనూ సరోగసీ


సిద్ధంగా ఉంచిన పిండాలు


గేదె గర్భంలో పిండాన్ని ప్రవేశపెడుతున్న వైద్యులు

- మేలు జాతి ఆవు దూడల జననంపై ఫలించిన ప్రయోగాలు
- ఇప్పుడు ఇదే పద్ధతిలో గేదెలలో పిండమార్పిడికి యత్నాలు
- క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లేందుకు 'వెంకట్రామన్నగూడెం' సిద్ధం

తాడేపల్లిగూడెం: మేలుజాతి పశువుల సంరక్షణ కోసం కృత్రిమ గర్భధారణ ప్రక్రియ వాడుకలోకి రావడంతో నిరంతర ప్రయోగాల అనంతరం ఫలించిన సరోగసీ పద్ధతులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లే బృహత్తర కార్యక్రమానికి శ్రీవెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వెంకట్రామన్నగూడెం గేదెల పరిశోధన స్థానం సరోగసీ ప్రక్రియను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి సన్నద్ధమైంది. ఆవులో సరోగసీ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీనిని ప్రేరణగా తీసుకుని మేలు జాతి గేదె దూడల జననానికి దోహదం చేసే సరోగసీ విధానంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విధానంలో ముర్రా జాతి గేదెల సంతతిని వృద్ధి చేయనున్నారు.

క్రియాశీలకంగా వెంకట్రామన్నగూడెం..

రాష్ట్రంలో ముర్రాజాతి గేదెల అభివృద్ధే ధ్యేయంగా 24 ఏళ్ల క్రితం జిల్లాలోని వెంకట్రామన్నగూడెంలో ప్రారంభించిన గేదెల పరిశోధన స్థానం ముర్రా జాతి వృద్ధిలో ప్రయోగాల పరంపరను కొనసాగిస్తూ ముందు వరుసలో నిలిచింది. తొలిదశలో ఆబోతుల తల్లి పాడి ఉత్పత్తి ఆధారంగా ఎంపిక చేసిన ముర్రాజాతి మేలు రకం ఆబోతుల వీర్యాన్ని తీసి జాతిని వృద్ధి చేసేవారు. ఈ వీర్యాన్ని రైతులకు సరఫరా చేసేవారు. ఆసక్తి కలిగిన రైతులకు మేలు జాతి దున్నలను ఇచ్చారు. పలు ప్రయోగాల ద్వారా గేదెల అభివృద్ధికి గేదెల్లో కన్సెప్సన్ విధానం ద్వారా 50 నుంచి 60 శాతం ఫలితాలను సాధించారు. కృత్రిమ గర్భధారణ పద్ధతులను అనుసరించారు.

సరోగసీ అంటే..

ముర్రా జాతిని త్వరితగతిన వృద్ధి చేయడానికి పిండమార్పిడి (సరోగసీ) విధానానికి శ్రీకారం చుట్టారు. అద్దెగర్భంలో పిండాన్ని అభివృద్ధి చేయడమే సరోగసీ. ఈ విధానంలో మొదట ఆడ పశువుల్లో సూపర్ ఓవిలేషన్ పద్ధతి ద్వారా ఒక గేదె నుంచి ఐదారు అండాలు సేకరిస్తారు. గుంటూరులోని పశు పరిశోధన స్థానంలోని ప్రయోగశాలలో వీటి చురుకుదనాన్ని పరిశీలించి న్యూట్రియన్స్‌లో ఉంచుతారు. మేలు రకం ఆబోతు వీర్యంతో జతపరిచి ఫలదీకరణం జరిగే వరకు పరిశీలిస్తారు. సుమారు ఆరు రోజులు ప్రయోగశాలలో ఉంచిన తర్వాత ఏడో రోజు అభివృద్ధి చెందిన పిండాలను (ఎంబ్రియో) గుణాత్మకంగా విశ్లేషిస్తారు. వాటిలో 80 నుంచి 100 శాతం చురుగ్గా ఉండి, ఆరోగ్యకరంగా ఉన్న పిండాలను ప్రయోగశాల నుంచి తీసుకొచ్చిన ఐదారు గంటల లోగా అద్దెగర్భంలోకి పంపిస్తారు. సరోగసీగా పిలిచే ఈ పద్ధతి ద్వారా ఒకేసారి ఐదారు గేదెలలో పిండోత్పత్తి చేసి ఐదారు మేలు రకం దూడలను పొందవచ్చు. సరోగసీకి ఎంపిక చేసుకున్న తల్లి పశువు ఈనే వరకు మేత, వసతి, ఆరోగ్య సమస్యలు లేకుండా కాపాడుకోవాలి.

ఫలితాల ఆధారంగా కార్యాచరణ

సరోగసీ ప్రక్రియ తొలిదశలో ఉంది. పశు పరిశోధనా స్థానం గుంటూరు వారి పరిజ్ఞానం సహకారంతో సరోగసీ ద్వారా దూడల జనన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విధానం ఆవుల్లో విజయవంతమైంది. ముర్రా జాతి సంతతిని త్వరితగతిన అభివృద్ధిపర్చే క్రమంలో గేదెల పరిశోధన స్థానం ద్వారా ఇటీవల ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. రైతులు కూడా సరోగసీ విధానాల్లో తమ పశువుల్లో అనుసరించే విధంగా శిక్షణను ఇస్తున్నాం. పరిశోధన స్థానం ఫలితాల ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుంది.

– డాక్టర్ కె.ఆనందరావు, హెడ్, గేదెల పరిశోధన స్థానం, వెంకట్రామన్నగూడెం

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తలు


చీపురుగూడెంలో టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

చాట్రాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం చీపురుగూడెంలో 15 మంది టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీలోకి చేర్చుకున్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అయిన వెంటనే అమలు చేశారని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతో వైఎస్ జగన్ పాలనకు చంద్రబాబు పాలనకు తేడా తెలుసుకుని వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తలు చేరుతున్నారని అన్నారు. అనంతరం ఉమ్మడి దుర్గారావు, కొమ్ము రాఘవులు, ఘంటసాల శ్రీను, తొమ్మంద్రు రమేష్, అబ్బదాసరి బాలస్వామి, సంకుల రాంబాబు, వెంకటేశ్వరావు, తంగిరాల సర్వేశ్వరావు, గంగరాజు, సంకుల వెంకటేశ్వరావు, పి.శ్రీనివాసరావు, గుండ్రు శ్రీను మరో ముగ్గురు కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఓబిళ్లనేని వెంకటేశ్వరావు, చీకటి శ్రీనివాసరావు, చెలికాని బాబ్జీ, కారంగుల వాసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యోగాసన రాష్ట్ర పోటీలు


పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 36వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు సేవాసమితి సహకారంతో 18 విభాగాల్లో పోటీలు ఏర్పాటు చేయగా 300 మంది పురుషులు, మహిళలు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలు డిసెంబర్‌లో కలకత్తాలో నిర్వహించే జాతీయ స్థాయి యోగాసన పోటీలలో పాల్గొంటారన్నారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతిరోజూ కొంత సమయం యోగాసనాలు చేయడం వలన మనస్సు ప్రశాంతంగా ఉండటమే కాక మంచి ఆరోగ్యం, ఆలోచనలు కలిగి జీవనం సుఖమయంగా ఉంటుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాయచోటి శ్రీకృష్ణదేవరాయలు, అల్లాడి రవికుమార్, ఆల్ ఇండియా యోగ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బ్రిజ్ కుమార్ పురోహిత్, సేవా సమితి కార్యదర్శి సుబ్రహ్మణ్యం రాజు, జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి యు.వెంకటేశ్వర రాజు, కోశాధికారి కె.కామరాజు పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం


ఉండి: మహదేవపట్నంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఫెన్సింగ్ పోటీల్లో పతకాల పంట


క్రీడాకారులను అభినందించిన దృశ్యం

సాక్షి, భీమవరం: కాకినాడలో రెండురోజుల పాటు నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి స్టేట్‌మిట్ ఫెన్సింగ్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్, 7వ రాష్ట్రస్థాయి యూత్ (అండర్–23) మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా క్రీడాకారులు వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లలో పలు పతకాలు సాధించారని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ చెప్పారు. సోమవారం భీమవరంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. 320 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో ఎం.వెంకటేష్ (బంగారు), టీవైబీ సాయిరాజ్ (వెండి), వీరా లక్ష్మీశ్రీజ (బంగారు) పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే టీమ్ ఈవెంట్‌లో వై.సుభాష్‌కుమార్ (బంగారు), ఎం.లీలాకృష్ణ (వెండి), చోడిశెట్టి హరినాగ అమూల్య (కాంస్యం), బి.మనోహర్ (వెండి), బి.సాయి (వెండి), డి.ఎలిష్ (వెండి) పతకాలు సాధించారని వివరించారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్


సి.పురుషోత్తం కుమార్, ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న వాహన ప్రమాద బీమా కేసులు, రెవెన్యూ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్టులున్న అన్ని ప్రదేశాలలో మోటారు వాహన ప్రమాద బీమా కేసులను, రెవెన్యూ కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇప్పటికే కొన్ని బీమా కంపెనీలతో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజూ పనివేళలో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తామని, న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో డబ్బు, సమయం ఆదా అవుతుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ కోరారు.

21న క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఉమ్మడి జిల్లా అండర్–14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ శ్రీనివాస్‌రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్కాపురం ఆశ్రం వైద్య కళాశాల క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభిస్తామన్నారు. 2009 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత పుట్టి 12 ఏళ్ల నుంచి 14 ఏళ్లలోపు ఉన్న బాలురు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వెల్లడించారు. ఆసక్తి గలవారు ఒరిజినల్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారు ఏసీఏ నిర్వహించే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొనాలన్నారు. మరింత సమాచారం కోసం 94910 44848 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సాక్షి, భీమవరం: భార్య మందలించిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన షేక్ రహీమాన్ (29) మద్యానికి బానిసై బెట్టింగ్‌లు కడుతూ అప్పులపాలయ్యాడు. ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వెళ్లి మద్యం తాగి రాత్రి ఇంటికి వచ్చిన రెహీమాన్‌ను తాగుడికి బానిస కావడం వల్ల అప్పులపాలయ్యామంటూ భార్య రజియా మందలించింది. దీంతో మనస్తాపానికి గురై గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని దుప్పటితో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రజియా చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు బద్దలు కొట్టి రహీమాన్‌ను ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అడబాల శ్రీను చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2382]

BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 7015828102 [HA-788339]
■ కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్, ప్రాపర్టీ, పర్సనల్, అగ్రికల్చర్, టేకోవర్ కొరకు DSA & ఏజెంట్స్ కావలెను. Salary + Commission. ఫోన్ : 9990752820 [HA-31103]

Wanted
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ టైమ్ లో పార్ట్‌టైం/ఫుల్ టైం వర్క్ చేస్తు 15,000/– ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర।। 7207776136 [G-481]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221745]

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 16k. Ph: 9640648899/ 9640528899 [HA-711]
■ కస్టల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 13,000–35000/– ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7993583999. [HA-727]
■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

సినిమా వార్తల కోసం లాగ్ఆన్ అవ్వండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యాసిడ్ దాడి కేసులో సత్వర న్యాయం భేష్


డీఐజీ అశోక్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, పూర్వ దిశ సీఐ ఇంద్ర శ్రీనివాస్

ఏలూరు టౌన్: ఏలూరులో యాసిడ్ దాడికి గురై మృతి చెందిన ఎడ్ల ఫ్రాన్సిక కేసులో బాధిత మహిళ కుటుంబానికి న్యాయం చేయటంలో పోలీసు, న్యాయవ్యవస్థ మరో చరిత్రకు నాంది పలికాయని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. యాసిడ్ దాడి కేసులో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం తన కార్యాలయంలో డీఐజీ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఈ కేసులో 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేయటంతోపాటు 21 రోజుల్లోనే పూర్తి ఆధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడమే కాక 117 రోజుల్లో విచారణ పూర్తి చేసి నిందితులకు యావజ్జీవ ఖైదు శిక్ష విధించేలా పోలీసు అధికారులు, సిబ్బంది తమ కర్తవ్యాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏలూరు జిల్లా ఎస్సీఎస్టీ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ కేసును త్వరితగతిన విచారణ చేపట్టి నిందితులకు శిక్షలు విధించటం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం, గౌరవం పెరిగేలా చేశారన్నారు. పూర్వ ఏలూరు దిశ సీఐ ఇంద్ర శ్రీనివాస్, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఏఎస్ఐ సోమేశ్వరరావు (సోము), హెచ్‌సీ పీ.రత్నరాజు, మహిళా హెచ్‌సీ ఎంవీ రమణ, కానిస్టేబుల్ ఆర్.లీలాసాయి, భాస్కరరావులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి, అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


పాలకొల్లు అర్బన్: పట్టణంలోని లజపతిరాయపేట రెండో వీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ ఐవీవీ సత్యనారాయణ చెప్పారు. నిందితుడు పొన్నాడ కోటేశ్వరరావుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

నరసాపురం రూరల్: బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కాళ్ల మండలం బొండాడకు చెందిన ఉడుము నాగేశ్వరరావు (27) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆదివారం బైక్‌పై పేరుపాలెం బీచ్‌కు వెళ్లి రాత్రి తిరిగి బయలుదేరారు. కొత్తకాయలతిప్ప వద్ద రహదారి మలుపులో బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, వారిని 108 వాహనంలో నరసాపురం తరలిస్తుండగా, మార్గమధ్యలో నాగేశ్వరరావు మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి ప్రాథమిక చికిత్స అందించారు. ఎస్సై ఎం.వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేరుశనగ.. దిగుబడి దండిగా

- మేలైన సస్యరక్షణతో అధిక దిగుబడులు
- మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ పూత దశలో పంట




మెట్ట ప్రాంతంలో వేరుశనగ పంట

చింతలపూడి: నూనె గింజల పంటల్లో వేరుశనగ పంటకు విశిష్ట స్థానం ఉంది. రాష్ట్రంలో ఖరీఫ్, రబీ పంటలుగా వేరుశనగను రైతులు పండిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట పూత దశలో ఉంది. రబీ పంట కోసం రైతులు ఇప్పటి నుంచే విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. మెట్ట ప్రాంతంలో వేరుశనగ పంట అధికంగా పండుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటగా రైతులను ఆదుకుంటోంది. ఈ పంట సాగుకు ఇసుకతో కూడిన గరప నేలలు, ఎర్రగరప నేలలు అనుకూలం. మేలైన సస్యరక్షణ చర్యలు చేపడితే వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ చెబుతున్నారు. ఈ పంటను వేరు పురుగు, ఎర్ర గొంగళి, తామరపురుగు, పేనుబంక, పచ్చ పురుగు ఆకు ముడత, లద్దె పురుగులు ఆశించి నష్టపరుస్తాయని, పంట సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ఆయన రైతులకు సూచనలు చేశారు.

విత్తనశుద్ధి, విత్తే విధానం

నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి. కిలో విత్తనాలకు 3 గ్రాముల మాంకోజెబ్ లేక ఒక గ్రాము కార్బెండిజమ్ పొడి మందును కలుపుకోవాలి. వేరు పురుగు ఉధృతి ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 6.5 మి.లీ క్లోరిపైరిఫాస్, లేక 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ చొప్పున కలిపి శుద్ధి చేసుకోవాలి. విత్తనాలను గొర్రుతో కానీ నాగలి చాళ్లలో కానీ విత్తాలి. విత్తనాలు విత్తే సమయంలో నేలలో తగినంత తేమ ఉండాలి. విత్తనాన్ని 5 సెం.మీ లోతు మించకుండా విత్తుకోవాలి.

సూక్ష్మపోషక లోపాల నివారణ

జింక్ లోపం ఉంటే మొక్కలు గిడసబారతాయి. ఆకులు చిన్నవిగా మారి గుబురుగా కనిపిస్తాయి. ఆకుల ఈనెల మధ్య పసుపు రంగులోకి మారతాయి. దీని నివారణకు ఎకరాకు 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి వారం మధ్యలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నల్లరేగడి నేలల్లో ఇనుము ధాతు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. లేత ఆకులు పసుపు పచ్చగా తరువాత తెలుపు రంగులోకి మారతాయి. ఈ లోపాన్ని సవరించడానికి ఎకరానికి ఒక కిలో అన్నభేది, 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

కలుపు లేకుండా చూడాలి

చేలో కలుపు మొలకెత్తక ముందే నశింపచేయగల కలుపు నాశిని బూటాక్లోర్ 50 శాతం 1.25–1.5 లీ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తనం విత్తిన వెంటనే లేదా రెండు, మూడు రోజుల లోపు నేలపై పిచికారీ చేయాలి. విత్తిన 20–25 రోజులకు గొర్రుతో అంతర కృషి చేయాలి. విత్తిన 45 రోజుల వరకు ఎలాంటి కలుపు లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

8 నుంచి 9 తడులు అవసరం

వేరుశనగ పంటను ఆరుతడి పంటగా రైతులు సాగు చేస్తారు. తేలిక నేలల్లో అయితే 8 నుంచి 9 తడులు పెడితే సరిపోతుంది. విత్తే ముందు నేల బాగా తడిసేటట్లు నీరు పెట్టి తగినంత చెమ్మ ఉన్నప్పుడు విత్తనం పెట్టుకోవాలి. విత్తిన 20, లేదా 25 రోజులకు రెండో తడిని పెట్టాలి. తరువాత తడులను నేల స్వభావం, తేమ శాతాన్ని అనుసరించి 7 నుంచి 10 రోజులకు ఒకసారి పెట్టుకోవాలి. ఆఖరి తడిని మాత్రం పంట కోతకు 15 రోజుల ముందు పెట్టాలి. నీటిని తుంపర్లు, స్ప్రింక్లర్ల ద్వారా పెట్టుకుంటే రైతుకు 25 శాతం నీరు ఆదా అవ్వడంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయి.

తెగుళ్ల నివారణ ఇలా..

ఎర్రగొంగళి పురుగు : ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు లీటరు నీటికి డైమిథియేట్ 2 మి.లీ లేక మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును కలిపి పిచికారీ చేయాలి.

వేరుపురుగు : వేరు పురుగు ఆశించిన మొక్కలు వాడి, ఎండి నశించిపోతాయి. మొక్కలను పీకితే సులువుగా ఊడి వస్తాయి. పొలంలో లోతు దుక్కులు చేయడం వలన వేరు పురుగు కోశస్థదశ బయటపడి పక్షుల బారిన పడతాయి. లేదా ఎండ వేడికి చనిపోతాయి. ఫోరేటు 10 శాతం గుళికలు ఎకరాకు 6 కిలోల చొప్పున గింజ విత్తే సమయంలో వేసుకోవాలి. ఒక కిలో విత్తనానికి 6.5 మి.లీ క్లోరిపైరిఫాస్ మందును కలిపి విత్తుకోవాలి.

ఆకుముడత : విత్తిన 15 రోజుల నుంచి ఆకుముడత తెగులు ఆశిస్తుంది. ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. వాటి మధ్య ఆకుమచ్చ రంగులో పిల్ల పురుగులు ఉంటాయి. ఇవి ఆకుల పచ్చదనాన్ని తినడం వల్ల ఆకులు ఎండి కాలినట్లు ఉంటాయి. వీటి నివారణకు క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ లేక మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేక క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పేనుబంక, పచ్చ దోమ నివారణకు డైమిథియేట్ 2.0 మి.లీ లేక మిథైల్‌ఓ–డెమటాన్ 2.0 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


బి నాగకుమార్, వ్యవసాయ శాఖ ఏడీ

క్లుప్తంగా

బలుసులమ్మకు సారె అందజేత



సారెను ఆలయానికి తీసుకువస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా మహోత్సవాలు సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ వారికి సోమవారం రాత్రి విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం కనకదుర్గమ్మ ఆలయం నుంచి అర్చక స్వాములు సారె తీసుకొని వచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ అంజిబాబు మాట్లాడుతూ డీప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఈ సారెను తీసుకువచ్చే సంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తొలుత మంగళ వాయిద్యాలతో, వేద మంత్రాలతో అమ్మవారి సారెను ఆలయం వద్దకు తెచ్చారు. ఈ కార్యక్రమంలో అంజిబాబు, కర్రి భాస్కరరావు, పెదప్రోలు భాస్కర్, ఉత్సవ కమిటీ సభ్యులు. మహిళలు సారెను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జగన్నాథపురం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, తద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. దోమల ద్వారానే వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సరోజిని, వెంకటలక్ష్మి, ఆశాలు దుర్గ, శ్రీలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ రవికుమార్, ఆరోగ్య సహాయకులు కాంతారావు, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్త ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బేబీ సుధకు వైఎస్సార్ బీమా చెక్కును అందజేస్తున్న తెన్నేటి జగజ్జీవన్ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్ బీమా పేద ప్రజలకు వరమని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు, 13వ వార్డు ఇంచార్జ్ తెన్నేటి జగజ్జీవన్ తెలిపారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రమాదవశాత్తు చనిపోతే ఆ కుటుంబాన్ని వైఎస్సార్ బీమా పథకంతో ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎం.శివ భార్య బేబీ సుధకు సోమవారం వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ 4,90,000 అకౌంట్లో జమ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ ఎస్.సూర్య, వెల్ఫేర్ సెక్రటరీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దసరా సెలవులను సద్వినియోగం చేసుకోండి



శాఖా గ్రంథాలయంలో దసరా సెలవులు సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా సెలవులు సందర్భంగా ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో సోమవారం హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు విశ్రాంత టీచర్ ప్రత్తి వీరాస్వామి, విశ్రాంత ఉద్యోగి బాపయ్య శర్మ, విశ్రాంత ఎంఈఓ సల్మాన్‌రాజులు కథలు, స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తకాలు చదవడం, ఏ విధంగా అర్థం చేసుకోవాలో తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విద్యార్థులతో పాటు చదువరులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

భీమవరం ప్రకాశం చౌక్: బాల్యవివాహాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ కృపామణి అన్నారు. భీమవరం మెప్మా విభాగంలో పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో స్వయం సహాయక సభ్యులకు మహిళ చట్టాలపైనా, బాల్య వివాహ చట్టంపైనా సోమవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సీహెచ్ నానిబాబు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాదేవీ నమోస్తుతే..



తాడేపల్లిగూడెం(టీఓసీ): వెండి వాకిలితో బలుసులమ్మ అమ్మవారు



తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ వాసవిలో కాశీ అన్నపూర్ణదేవిగా అలంకరణ



తణుకు టౌన్: గాయత్రీ దేవి అలంకరణలో మండపాక యల్లారమ్మ



తాడేపల్లిగూడెం రూరల్: బాలాత్రిపుర సుందరీదేవిగా ముత్యాలమ్మవారు



తణుకు అర్బన్: కొట్టి వారి వీధిలో దుర్గమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి కారుమూరి

రెండోరోజు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల రెండోరోజు బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వాడవాడలా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, యువత మాలదారణ చేసి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. జై.దుర్గ, జైజై దుర్గ అంటూ భక్తులు నినదించగా..గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈనెల 24తో ఉత్సవాలు ముగియనున్నాయి.

- తాడేపల్లిగూడెం రూరల్, తాడేపల్లిగూడెం (టీఓసీ), పెంటపాడు, తణుకు అర్బన్, తణుకు టౌన్/నెట్ వర్క్



పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్‌లో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

ప్రభుత్వ భూములకు సాగు పట్టాలు మంజూరు చేయాలి



పెదతాడేపల్లి గ్రామంలో జరిగిన దళిత సేన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గానికి చెందిన రైతులు సాగు చేసుకునే ప్రభుత్వ భూములకు సాగు పట్టాలు మంజూరు చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో దళిత సేన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ పంచాయతీ తీర్మాణాలను అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసి అసైన్డ్ కమిటి ద్వారా ఎస్సీ, ఎస్టీ బీసీలకు సాగు పట్టాలు మంజూరు చేసే విధంగా చూడాలన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా పెన్షన్లు పెంపుదల చేయాలని, వీరికి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద నవంబరు 20వ తేదిన జరగనున్న దళిత సేన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, దళిత సేన రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు తేళ్ల జోసెఫ్, దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, నియోజకవర్గ అధ్యక్షుడు దూలపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠ



రావిపాడులో కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న యువనేత కొట్టు విశాల్, తదితరులు

పెంటపాడు: రావిపాడులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ, విగ్రహప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండు రోజుల నుంచి ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరిగాయి. సోమవారం ప్రతిష్ఠ పురస్కరించుకొని భారీ సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దుర్గమ్మ అమ్మవారిని యువనేత కొట్టు విశాల్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. 20న భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు దేవ వెంకటరమణ, సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు కై గాల గణపతి, ద్వారబందం సత్యనారాయణ, దాట్ల రామలింగరాజు. మాజీ సర్పంచ్‌లు ములగాల బాబ్జి, వింజమూరి శ్రీనివాస్, డెక్కపాటి వెంకటరమణ, పూడి శ్రీనివాస్, పెన్నాడ రాఘవ, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగన్నాథపురం సచివాలయం వద్ద ధర్నా



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని జగన్నాథపురం సచివాలయం వద్ద సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు పనులు లేక ఉపాధి పనుల కోసం ఎదురు చూస్తున్నారని, వెంటనే పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ పథకాన్ని సమగ్రంగా అమలు చేయడానికి రూ.2.40లక్షల కోట్లు కేటాయించాలని, ఉపాధి కూలి రూ.600లు చెల్లించాలని, 200 పని దినాలు కల్పించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పీలా గాదినాయుడు, గజ్జరపు వెంకటేశ్వరరావు, కోనవరపు నాగభూషణం, ఆమర్తి చంద్రరావు, నల్లి శ్రీను, పి.వీర్రాజు, గంప నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడిగా గంటి ప్రమాణస్వీకారం



శ్రీవారి ఆలయ నూతన ట్రస్టుబోర్డు సభ్యుడిగా సంతకం చేస్తున్న చినసర్వేశ్వరరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయ నూతన ట్రస్టుబోర్డు సభ్యుడిగా తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంకు చెందిన గంటి చినసర్వేశ్వరరావు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన ముప్పిడి సంపత్‌కుమార్ ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడి పదవికి ఇటీవల రాజీనామా చేయడంతో, ఆయన స్థానంలో చినసర్వేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీన్ని పురస్కరించుకుని చినసర్వేశ్వరరావు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలసి ఉదయం ఆలయానికి విచ్చేశారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ఆలయ ముఖ మండపంలో అర్చకుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. అనంతరం ప్రమాణస్వీకారం చేసి పదవిని చేపట్టారు.

కొనసాగిన న్యాయవాదుల దీక్ష

సాక్షి, భీమవరం: అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ చట్టంలో సవరణలు, బార్ కౌన్సిల్ తీర్మానాలను వ్యతిరేకిస్తూ భీమవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. వారంరోజులుగా కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు, దీక్షలు చేస్తున్నారు.

రావిపాడు సొసైటీ అధ్యక్షుడిగా కైగాల గణపతి



కైగాల గణపతి, సభ్యులను అభినందిస్తున్న యువనేత కొట్టు విశాల్

పెంటపాడు: రావిపాడు వ్యవసాయపరపతి సహకారసంఘ నూతన అధ్యక్షుడిగా కై గాల గణపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా కై గాల గణపతి, సభ్యులుగా దాట్ల రామలింగరాజు, ద్వారబందం వీరవెంకట సత్యనారాయణలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ గ్రామంలో సహకార సొసైటీని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు, సభ్యత్వాల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే సొసైటీ రూ. 16 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో సొసైటీ గోడౌన్‌కు రూ.46 లక్షల అందించి నిర్మాణానికి కృషి చేయడం పట్ల మంత్రికి ఈ సందర్భంగా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.సొసైటీ నూతన ఎన్నిక పట్ల పలువురు ప్రముఖులు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పూల దండలు, బొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తరపున తనయులు కొట్టు విశాల్, ఎంపీపీ దాసరి హైమావతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, పార్టీ అధ్యక్షులు, జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షులు కై గాల శ్రీనివాస్, పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, మాజీ సర్పంచ్‌లు ములగాల బాబ్జి, వింజమూరి శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి మాదాసు రాంబాబు, పార్టీ ఎస్సీ నాయకులు డెక్కపాటి వెంకటరమణ, భట్టు భరతాంజనేయులు, ఆకుల బాలాజీ, పూడి శ్రీనివాస్, సొసైటీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించాలి



పెంటపాడులో వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో చెన్నయ్య

పెంటపాడు: సార్వా ధాన్యం కొనుగోళ్లలో విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సిబ్బంది సక్రమంగా పనిచేయాలని ఆర్డీవో చెన్నయ్య, తహసిల్దార్ జీవీ శేషగిరిరావులు పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు మండల డ్వాక్రా సమాఖ్య కార్యాలయం వద్ద సార్వా ధాన్యం కొనుగోలుపై అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు కమిటీల ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో, తహసీల్దార్, ఏవోలు మాట్లాడుతూ సంచుల కొరతలేకుండా చూసుకోవాలన్నారు. గత సీజన్ కన్నా మెరుగ్గా కొనుగోలు విషయంలో శ్రద్ధ కనపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పార్థసారధి, కస్టోడియన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

పలు గ్రామాల్లో ప్రారంభమైన ఆరోగ్య సురక్ష శిబిరాలు



పెంటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి హైమావతి



తణుకు టౌన్: వేల్పూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



తాడేపల్లిగూడెం రూరల్: సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ సామ్యూల్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల ఆరోగ్యమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు ఈ శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష సర్వే ద్వారా గుర్తించిన రోగులను శిబిరాలకు తరలించి, వారికి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వీరిలో ఉన్నత వైద్యం అవసరమైన వారికి ఆసుపత్రులకు తరలించనున్నట్టు తెలిపారు. అనంతరం 800మందికి వైద్యులు సీహెచ్.శ్రీహర్ష, వీరవెంకటేష్, జె.సతీష్, జి.చైతన్యకిరణ్‌లు వైద్య సేవలందించారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ కార్యదర్శి పవన్‌కుమార్, ఎమ్పీటీసీ మట్టా సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి, ఐసీడీఎస్ అధికారులు, సీహెచ్‌వోలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్షతో పేదలకు మేలు

పెంటపాడు: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం పెంటపాడు మండలం మౌంజీపాడు గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ వద్ద ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మైలవరపు స్వర్ణలత, మండల సచివాలయాల, గృహసారథుల కన్వీనర్ మైలవరపు పెదబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో కష్టపడుతున్నారన్నారు. ప్రతి సచివాలయంలో ప్రత్యేక క్యాంపులతో పాటు, నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీగా ప్రత్యేక వైద్యులతో మోగా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యసేవలే పరమావధిగా భావించి నేడు పేదలకు ఇంటింటికీ ఉచిత వైద్యసేవలు చేయిస్తున్న సీఎం అభినందనీయులన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సాంబయ్యలు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మంచి వైద్యం అందుతోందన్నారు. ఉమామహేశ్వరం సర్పంచ్ మద్దుకూరి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వెంకన్న బాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోగులు శిబిరంలో పోటెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంఈవో ఎం. శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి ఎస్. రామకృష్ణ, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, పెంటపాడు, ముదునూరు వైద్యాధికారులు వి. మౌనిక, ఎస్. వెంకటరమణ, ప్రత్యేక వైద్యులు అమిరున్నీసా(గైనకాలజీ), పి.నవీన్ (జనరల్ సర్జన్) కంటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ముదునూరు, పెంటపాడు పీహెచ్‌సీలకు చెందిన వైద్యసిబ్బంది, జయప్రద, ఈశ్వరి, మెర్సీ, రజనీరత్నం, నాగమణి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలతో పాటు, ఎంపీడీవో సీహెచ్. బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

తణుకు టౌన్: మండలంలోని వేల్పూరు గ్రామంలోని 2వ గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 1107 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో కే కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం వేల్పూరు గ్రామంలో నెంబరు 2 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులతో పాటు సాధారణ వైద్యులు పాల్గొని వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 34 మందికి ఈసీజీ పరీక్షలు చేసి ఇద్దరిని ఆరోగ్యశ్రీ పథకానికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రామకోటేశ్వరరావు, ఎంపీటీసీ విజయ దుర్గ, వైద్యులు డాక్టర్ టీఎల్ఎస్ హరిణి, డాక్టర్ కేఎంఆర్ కిషోర్, డాక్టర్ డీ రమేష్, బీ మోహిత్, డాక్టర ఎస్ సత్యనారాయణ, డాక్టర్ పృధ్వి, గ్రామ కార్యదర్శి వీ గంగాధరరావు, షేక్ మీరా సహెల, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి రక్ష జగనన్న సురక్ష

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజల ఆరోగ్యానికి రక్షణగా పీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఎంతగానో దోహదపడుతుందని సీజీఎఫ్ కమిటీ సభ్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు తెలిపారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్ అధ్యక్షతన పట్టణంలోని సంజీవ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం 8, 9,10 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కమిషనర్ డాక్టర్ శామ్యూల్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, నోడల్ ఆఫీసర్ రవికుమార్, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, వార్డు ఇంచార్జిలు కర్రి సుధాకర్ రెడ్డి, బూడి దుర్గా ప్రసాద్, అడ్డాల నరసింహారావు, చామన ప్రసాద్, మునిసిపల్ ఇంజనీర్ మురళీకృష్ణ, మునిసిపల్ ఏఎస్ఓ సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ కనకదుర్గా భవానీ, అంగన్‌వాడీలు, ఆశాలు, గృహసారథులు, వార్డు ఇంచార్జ్‌లు, వలంటీర్లు, ఐసీడీఎస్, సచివాలయం సిబ్బంది, పోలీసింగ్, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హింథీ పరీక్షలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



సుశాంత్

తాడేపల్లిగూడెం రూరల్: దక్షిణ భారత హింథీ ప్రచార సభ నిర్వహించిన భాషా పండిత పరీక్షల్లో మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. మాధ్యమికలో పాఠశాలకు చెందిన గెద్దం సుశాంత్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ బి.రాజారావు సోమవారం తెలిపారు. ప్రాథమిక 163మంది, మాధ్యమిక 282మంది, రాష్ట్ర భాష ఏడుగురు, ప్రవేశిక 32 మంది హాజరు కాగా, నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీసీవో ఎస్.సంజీవరావు, ప్రిన్సిపల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, హింథీ టీచర్స్ ఎంవి.బాలాజీ, బి.శ్రీనివాసరావు అభినందించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సామాన్య ప్రజలకు విద్యుత్ చార్జీలు షాక్ కొడుతున్నాయని సీపీఎం, సీపీఐ నాయకులు విమర్శించారు. వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్సు స్టాండ్ వద్ద ప్రజా బ్యాలెట్‌ను నిర్వహించారు. నాయకులు మండల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, మడక రాజు, వెంకన్న, రాము, బాబి, ధనరాజు, శివ తదితరులు బ్యాలెట్‌ను పర్యవేక్షించారు. వక్తలు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం
90102 23729
90100 68395
63097 62918
తణుకు
90108 43311
90100 51493
Office mail : tpgadvt@gmail.com